మున్నూరు కాపు మాసపత్రిక ఆవిష్కరణ



మాసపత్రికను ఆవిష్కరిస్తున్న పలువురు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని మున్నూరుకాపు కళ్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా ప్రచార కార్యదర్శి బసవరాజ్ చేతుల మీదుగా మున్నూరుకాపు మాసపత్రిక ఆవిష్కరణ చేసి మున్నూరు కాపు మండల అధ్యక్షులు గడ్డం అరవింద్, గ్రామ అధ్యక్షులు బొమ్మల లక్ష్మణ్‌కు అందజేశారు. అనంతరం బసవరాజ్ మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా మున్నూరు కాపు కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రతి ఒక్కరూ ఒకరికొకరు తోడుగా ఉంటూ మున్నూరు కాపు సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సాయిని అశోక్, చిన్ సాబ్ సుధీర్, తమ్మూర్ గంగాధర్, అవార్ సాయిలు, అవార్ రాములు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని చిన్నఎక్లారా గ్రామానికి చెందిన కౌలస్కర్ రాములు (52) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాములు తన చేనులో మొక్కజొన్న పంటకు నీటిని పారిస్తున్న క్రమంలో అకస్మాత్తుగా బోరు బంద్ కావడంతో శివారు ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి హ్యాండిల్ ముట్టుకోగా కరెంట్ షాక్ తగిలి రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని శవ పంచనామా చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మద్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎస్‌బీఐ సర్వీస్ పాయింట్ల దోపిడీ



- జీరో ఖాతాకు డబ్బులు వసూలు చేస్తున్న వైనం
- ఖాతా తీయాలంటే.. ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఒత్తిడి

నవతెలంగాణ-కామారెడ్డి

డబ్బులను బ్యాంకులో వేసుకోవడానికి, అవసరానికి డబ్బులు తీసుకోవడానికి.. బ్యాంకులలో పెరిగే రద్దీని తగ్గించి ఖాతాదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు మెరుగైన సర్వీస్ కొరకు అక్కడక్కడ ఎస్‌బీఐ సర్వీస్ పాయింట్లను ఏర్పాటు చేసింది. ఈ సర్వీస్ పాయింట్లలో ఖాతాదారుల అవసరాలను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సర్వీస్ పాయింట్ నిర్వాహకులు అందిన కాడికి దోపిడీకి పాల్పడుతున్నారు.

కామారెడ్డి జిల్లాలోని ఆయా మండలాలలో ఉన్న ఎస్‌బీఐ సర్వీస్ పాయింట్లలో జీరో ఖాతా ఓపెన్ చేయడానికి ఎలాంటి చార్జ్ తీసుకోకుండానే ఖాతాను ఓపెన్ చేయాలి. కానీ సర్వీస్ పాయింట్ నిర్వాహకులు 100 నుంచి 200 రూపాయల వరకు వసూళ్లు చేయడమే కాకుండా డబ్బులు వేసినా, తీసినా సర్వీస్ ఛార్జ్ పేరిట దోపిడీకి పాల్పడుతున్నారు. కొత్త ఖాతా ఓపెన్ చేయాలంటే ఇన్సూరెన్స్ అనేది ఖాతాదారుడి ఇష్టం. కానీ చేయించుకుంటేనే ఖాతా ఓపెన్ చేస్తామని, లేకుంటే చేయబోమని నిర్వాహకుల వద్ద నుంచి బలవంతంగా ఇన్సూరెన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారు. సర్వీస్ పాయింట్లలో యథేచ్ఛగా దోపిడీ జరుగుతున్నా సమీప బ్యాంకు మేనేజర్ కానీ, సిబ్బంది కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. తమ ఇష్టానుసారంగా సర్వీస్ పాయింట్‌కు వచ్చే ఖాతాదారుల అమాయకత్వాన్ని అదునుగా చేసుకొని దోపిడీకి పాల్పడుతున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఇసుక డంపులు సీజ్

మంజీరాలో ఇసుక తవ్వకాలు కథనానికి అధికారుల స్పందన

నవతెలంగాణ-బిచ్కుంద

'మంజీరాలో ఇసుక తవ్వకాలు' అనే శీర్షికన సోమవారం నవతెలంగాణలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఇసుక అక్రమ తరలింపునకు వెంటనే చర్యలు చేపట్టాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఆదేశించడంతో తహసీల్దార్ లక్ష్మణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా, ఎస్సై మురళి గోపన్‌పల్లి, ఖద్గాం గ్రామ శివారులో గుట్టల్లో లారీల ద్వారా రవాణా కోసం వేసిన 24 ఇసుక దంపులను సీజ్ చేశారు. జిల్లా అధికారులకు సమాచారం అందించామని, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేసిన 24 ఇసుక దంపులను మంగళవారం వేలంపాట నిర్వహించనున్నట్టు తహసీల్దార్ లక్ష్మణ్ తెలిపారు. వారి వెంట రెవెన్యూ పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ఇసుక కుప్పలను సీజ్ చేస్తున్న అధికారులు

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశమునకై 2024-2025 విద్యా సంవత్సరానికి గానూ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎడపల్లి మండల పరిధిలో గల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగవ తరగతి చదువుతున్న బాలబాలికలు ఐదవ తరగతిలో ప్రవేశ పరీక్షకు అర్హులని ఆమె తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థి బాలబాలికల అభివృద్ధికి చెందిన ఇతర వర్గాల పిల్లలతో సమానంగా న్యాయమైన విద్యను అందిస్తూ వారిలో సహజసిద్ధమైన నైపుణ్యంను వెలికితీస్తూ ఆ విద్యార్థులను 21వ శతాబ్దపు సవాళ్లను ధీటుగా ఎదురుకోవడానికి గురుకుల సంస్థ సిద్ధం చేస్తుందని ఆమె తెలిపారు. ఈ లక్ష్యంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ అలాగే జనరల్ గురుకులం పాఠశాలలను సంక్షేమశాఖల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నేలకొల్పిందని పేర్కొన్నారు. ఇంగ్లీష్ మీడియంలో విజయవంతంగా నడుస్తున్న ఈ గురుకుల పాఠశాలలో బాల బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఇతర సమాచారం కొరకు హెల్ప్‌లైన్ 180042545678 నెంబర్‌ను సంప్రదించాలని, 11.02.2024న అర్హత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

భిక్కనూరులో ఘనంగా 'సుబ్రహ్మణ్య షష్టి' వేడుకలు



సుబ్రహ్మణ్య షష్టి వేడుకల్లో భాగంగా పూజలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూరు గ్రామంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకలను గ్రామానికి చెందిన సంగారెడ్డి గారి వంశీయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పొలిమేరలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి (మల్లన్నగుడి) ఆలయాన్ని అందంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వరుడికి, శివలింగానికి, నంది తదితర విగ్రహాలకు ఒగ్గు పూజారులతో కలిసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు నిర్వహించి, స్వామివారికి నైవేద్యం, తీర్థ ప్రసాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఒగ్గు పూజారులు, కళాకారులు సుబ్రహ్మణ్యషష్టి విశిష్టతను ప్రజలకు పాటల రూపంలో తెలిపారు. చివరగా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సుబ్రహ్మణ్య షష్టి విశిష్టత..

శివుని కుమారుడు అయిన సుబ్రహ్మణ్యస్వామికి దేవసేనతో అత్యంత వైభవంగా వివాహం జరిగిన రోజుని "శ్రీ సుబ్రహ్మణ్య షష్టి"గా పరిగణిస్తారు. నాగ దోష నివారణకు, సంతాన లేమి, జ్ఞానవృద్ధికీ, కుజ దోష నివారణకు సుబ్రహ్మణ్య స్వామిని ఆరాధిస్తారు. స్కంద పంచమి, షష్టి రోజుల్లో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే సకల సంపదలు, సుఖవంతమైన జీవితం లభిస్తుందని స్కంద పురాణం చెబుతున్నది. ఈ నేపథ్యంలో దేశంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో షష్టి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. కార్యక్రమంలో సంగారెడ్డి గారి వంశీయులు ఇంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డితోపాటు వారి కుటుంబ సభ్యులు భిక్కనూర్, శివాపూర్, బొల్లారం గ్రామాలకు చెందిన ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మార్పులు చేయాలి

- డిప్యూటీ తహసీల్దార్ చంద్ర రాజేశ్వరరావు

నవతెలంగాణ-లింగంపేట్



శిక్షణలో పాల్గొన్న బీఎల్ఓలు

ఓటరు జాబితాలో మార్పులు చేయాలని లింగంపేట్ డిప్యూటీ తహసీల్దార్ చంద్ర రాజేశ్వరరావు బిఎల్వోలుకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో కెఎల్ఎంటి శిక్షణ నిర్వహణలో భాగంగా బిఎల్ఓలకు జిల్లా అధికారుల ఆదేశానుసారం పలు సూచనలు చేశారు. ఓటరు జాబితాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని అదేవిధంగా ఓటర్ జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించాలన్నారు. కొత్త ఓటర్ల పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. ఓటు హక్కు ఉన్న ఇతర ప్రాంతాలకు వెళ్ళినట్లయితే వారికి నోటీసులు ఇచ్చి తొలగించాలన్నారు. ఒక ఓటరు రెండు చోట్ల ఓటు ఉన్నట్లయితే వారికి నోటీసు తొలగించాలన్నారు. 80 సంవత్సరాల నుంచి ఓటర్ వివరాలు, వికలాంగుల ఓటర్ వివరాలు సేకరించాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

- తనవంతు పూర్తి సహకారమందిస్తా
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి రాష్ట్రం, దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుటలో అధికారులు నిబద్ధతగా, చిత్తశుద్ధితో పనిచేయాలని, తన వంతు పూర్తి సహకారమందిస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కోరారు. కామారెడ్డి నియోజకవర్గంలో అవినీతిరహిత పారదర్శక పాలన అందించాలన్నదే తన లక్ష్యమని అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి మాట్లాడుతూ.. కలెక్టరేట్ దేవాలయం, అధికారులు దేవుళ్ల లాంటివారని ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రభుత్వ ఆశయాలకనుగుణంగా పనిచేయాలని అన్నారు. మనం ఎంతో కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించామని, ఆ కష్టాలను గుర్తెరిగి, నా వల్ల ఎవరు నష్టపోరాదనే భావనతో భవిష్యత్తు తరాల కోసం పనిచేయాలని, గతం తిరగేస్తే ఎన్నో కుటుంబాలు బాగుపడ్డాయన్న ఆత్మ సంతృప్తి కలగాలని హితవు పలికారు. విధి నిర్వహణలో కొన్ని ఒత్తిడులు వచ్చినా నిబంధనల మేరకు పనిచేయాలని, ఒకరిపై నిందారోపణలు చేయవద్దని, మన వ్యక్తిత్వం మంచిగా ఉండాలన్నారు. పరిపాలన శక్తివంతంగా ఉండాలని, విధి నిర్వహణ మానవతా దృక్పథం, నిజాయితీ కలిగి ఉండాలని సూచించారు. తనకు వ్యవస్థపై గౌరవం ఉందని, జనానికి ఉపయోగపడే సమస్యల గురించి మాత్రమే అధికారులను అడుగుతానని, అధికారులు కూడా అంతే నిజాయితీగా స్పందిస్తూ వాస్తవాలను తెలపాలని కోరా రు. నియోజకవర్గానికి సంబంధించి ఏ విషయమైనా సానుకూల దృక్పథంతో తననుకలవవచ్చని, లేదా ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల ద్వారా అమలు పరుస్తున్న కార్యక్రమాలు, ప్రగతిలో ఉన్న పనులు, వివరాలను శాఖల వారీగా అడిగి తెలుసుకున్నారు. త్వరలో శాఖల వారీగా విడివిడిగా సమీక్షిస్తానని అన్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు మంచి సమర్థులని, తమ శాఖల ద్వారా కేటాయించిన లక్ష్య సాధనలో బాగా కృషిచేస్తున్నారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

పనుల నిర్వహణలో ప్రజాప్రతినిధులకు సమాచారమందిస్తూ వారి సలహాలు, సూచనలు స్వీకరించడంతో పాటు పూర్తి సహకారమందిస్తారన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఓ, మెప్మా, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, నీటిపారుదల, విద్యుత్, వైద్యం, విద్య, సంక్షేమ శాఖ, ఆర్అండ్‌బి, పౌర సరఫరాలు, మున్సిపాలిటీ, అటవీ, లీగల్, మెట్రాలజీ, వ్యవసాయం, పశుసంవర్ధకం, సెరికల్చర్, ఆర్.టి.సి, అగ్నిమాపకం, తదితర శాఖల ద్వారా అమలు పరుస్తున్న కార్యక్రమాలు, వాటి ప్రగతిని శాసనసభ్యులకు వివరించారు. ఈ ఖరీఫ్‌లో 4కోట్ల 43 లక్షల ధాన్యం సేకరించామన్నారు. 5500 మంది వీధి వ్యాపారులకు మూడు దఫాలుగా 10 వేలు, 20 వేలు, 50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేసి దేశంలో అగ్రస్థానంలో నిలిచామని కలెక్టర్ వివరించారు. మహాలక్ష్మి పథకం పట్ల మహిళల నుండి అపూర్వ స్పందన లభిస్తున్నదని, ఆర్.టి.సి. బస్టాండ్ కిటకిటలాడుతున్నాయని అన్నారు. కామారెడ్డి మునిసిపాలిటీల్లో బహిరంగ ప్రదేశాలు ఎక్కడా అన్యాక్రాంతం కాకుండా చూస్తామన్నారు. కామారెడ్డి పట్టణంలో రెండు రైల్వే వంతెనలు, 10 బ్రిడ్జిల నిర్మాణ ఆవశ్యకత కలదని వివరించారు. ఈ సందర్భంగా అధికారులు శాసనసభ్యుడిని పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో ఆర్.డి.ఓ. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు, డివిజనల్‌స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

నవతెలంగాణ-మద్నూర్/బిచ్కుంద

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు అధికారులను హెచ్చరించారు. మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు వాగ్మారే లక్ష్మీబాయి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా నూతనంగా జుక్కల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తోట లక్ష్మీకాంతరావు హాజరయ్యారు. మొట్టమొదట సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదంటూ హెచ్చరిస్తూ సమావేశంలో హడలెత్తించారు. విద్యాశాఖ మండల అధికారి రాములు నాయక్ తమ నివేదికలు తప్పుగా చూపించడం ఆయన నివేదికల కాపీలను విద్యాశాఖ అధికారికి రిటర్న్ చేస్తూ ఇలా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఆ అధికారికి హెచ్చరించారు. విద్యాశాఖకు సంబంధించిన సరైన నివేదికలు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇరిగేషన్‌శాఖ ఏఈ తమ నివేదికలు వినిపిస్తూ అంతర్రాష్ట్ర లేండి ప్రాజెక్టు 1984లో ఇరు రాష్ట్రాలు కలిసి సంయుక్తంగా ప్రారంభించిన ప్రాజెక్టు మహారాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పెండింగ్‌లోనే ఉంటుందని సభలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఎందుకు పెండింగ్ ఉంటుంది కారణాలు ఏమిటి అంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇప్పటివరకు తెలంగాణ వాటి కింద మహారాష్ట్ర ప్రభుత్వానికి రూ.189 కోట్లు మన రాష్ట్రం అందించిందని, ప్రస్తుత వ్యయం మన వాటా కింద రూ.414 కోట్లు అవసరమని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే మద్నూర్, బిచ్కుంద మండలాల పరిధిలోని 22 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని తెలిపారు.



మద్నూర్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ ఒక్కొక్క శాఖ అధికారుల గురించి ప్రత్యేకంగా సమగ్రమైన నివేదికలు అందజేయాలని తప్పుడు నివేదికలు చూపిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత మొట్టమొదటసారిగా సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ప్రజా సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సమావేశానికి ఆరోగ్య శాఖ అధికారులు గైర్హాజరు అవడంతో ఆ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గైర్హాజరైన అధికారి గురించి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపాలని ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్‌ను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్య, వైద్యం, రవాణా, వ్యవసాయం అభివృద్ధి పట్ల ప్రత్యేకంగా దృష్టి సారిస్తారని తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లక్ష్మీబాయి, వైస్ ఎంపీపీ జైపాల్ రెడ్డి, ఎంపీడీవో రవీశ్వర్‌గౌడ్ నూతన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. అదేవిధంగా శాఖల వారీగా అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో డోంగ్లి తహసీల్దార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గెలుపు నాది కాదు.. ప్రజలది..

బిచ్కుంద : శాసనసభ ఎన్నికల్లో జుక్కల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నన్ను గెలిపించినా ఈ విజయం అహర్నిశలు కష్టపడిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నాకు ఓటు వేసిన ఓటర్లదేనని జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు అన్నారు. సోమవారం బిచ్కుంద మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా నాయకులు, కార్యకర్తలు ప్రజలు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రధాన రహదారిన ఎమ్మెల్యేకు పూల మాలలు వేసి స్వాగతం పలుకుతూ సభాస్థలి వరకు భారీ ర్యాలీ తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది యువకులు తెలంగాణ కోసం వారి ప్రాణాలు బలిదానం ఇచ్చారని, స్పందించిన సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేయగా ఇప్పటివరకు బీఆర్ఎస్ రాబంధులు పాలన చేశాయని అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో వైద్య, విద్యా రంగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నాయకులు కార్యకర్తలు ప్రజలకు అందే విధంగా కృషి చేయాలని ఈ బాధ్యత మనందరి భుజాన ఉందని అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో గతంలో అక్రమ ఇసుక సామ్రాజ్యం కొనసాగిందని భూగర్భ జలాలు అడుగంటి తీవ్ర నష్టం రైతులకు జరిగిందన్నారు. బీడు కార్మికులు తమకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం ఇచ్చారు. మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, సీనియర్ నాయకులు మల్లికార్జునప్పా షెట్కార్, పిసిసి డెలిగేట్ విట్టల్ రెడ్డి, మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్, నాయకులు మున్నూరు నాగనాథ్, వెంకట్ రెడ్డి, నౌషా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి భారీగా వలసలు

- ఖాళీ అవుతున్న బీఆర్ఎస్

నవతెలంగాణ-మద్నూర్



కాంగ్రెస్‌లోకి చేరుతున్న పలువురు

పది సంవత్సరాల తర్వాత అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ రావడం 10 సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ పార్టీలో కొనసాగిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నూతనంగా ఎన్నికైన జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరుతున్నారు. ఒక్కొక్కరిగా బీఆర్ఎస్ పార్టీని వదులుకుంటూ కాంగ్రెస్ పార్టీలోకి వలసలుగా చేరడం బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకు ఖాళీ అవుతుంది. అధికారంలో కొనసాగిన బిఆర్ఎస్ పార్టీ హయంలో తమకు ఎలాంటి న్యాయం జరగలేదని ప్రజలకు సేవలు అందించలేకపోయామని కాంగ్రెస్ పార్టీ హాయంలో ప్రజలకు న్యాయం చేకూరుతుందనే విశ్వాసంతో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు తడిఇప్పర్గా గ్రామ సర్పంచ్ ప్రకాష్ గాయక్వాడ్ తెలిపారు. ఎమ్మెల్యే సమక్షంలో అంతాపూర్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, మద్నూర్ మాజీ సర్పంచ్ కుటుంబీకులు, అలాగే కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షునిగా కొనసాగిన రమేష్ వట్నాలవార్ మళ్లీ సొంత పార్టీలో చేరారు. ఇదివరకు షర్మిల పార్టీలో కొనసాగిన మేనూరు గ్రామానికి చెందిన రైస్ ఖాన్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్ పటేల్, సాహెబ్రావ్, మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లికార్జున అప్ప ఇతర నాయకులు పాల్గొన్నారు.

లైబ్రరీ పుస్తకాలు పిల్లలకు అందుబాటులో ఉండాలి



విద్యాబోధనను పరిశీలిస్తున్న మండల నోడల్ అధికారి

నవతెలంగాణ-పిట్లం

లైబ్రరీ పుస్తకాలు పిల్లలకు అందుబాటులో ఉండేలా చూడాలని మండల నోడల్ అధికారి రమణరావు అన్నారు. సోమ వారం మండ లంలోని బొల్లాక్‌పల్లి, మద్యల్ చెరువు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు సామాజిక స్థితిగతులపై అవగాహన కల్పించేందుకు విభిన్నమైన కథలు, నవలలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉన్నతి కార్యక్రమాల రిపోర్టు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. తరగతుల సబ్జెక్టు వారిగా ఆన్‌లైన్‌మెంట్ రాసి పెట్టుకోవాలని అన్నారు. ఆశించిన అభ్యసన ఫలితాలు, పోస్టర్లు తరగతి గదిలో ప్రదర్శింపబడేలా చూడాలని సూచించారు. అనంతరం మాదిరి తరగతి విద్య బోధనను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాలల సిబ్బంది రమేష్, సవిత, జ్యోతి లక్ష్మీ కల్పన, శోభారాణి, సుకన్య, హటియా సింగ్, ఆ ప్రాంత క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గోపాల్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం ఆరు హత్యలు

- లోన్ ఇప్పిస్తానని నమ్మబలికి ఘాతుకం..
- స్నేహితుడితో పాటు.. అతని కుటుంబాన్ని హతమార్చిన వైనం
- హత్యకు గురైనవారందరిదీ ఒకే కుటుంబం
- నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో కలకలం రేపిన ఘటన
- నిందితుడు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అనుచరుడు



హత్యకు గురైన ప్రసాద్, స్వప్న, ప్రవంతి, రమణి, చైత్రి, చైతు (ఫైల్)

నవతెలంగాణ-మాక్లూర్

ఆస్తికోసం ఆశపడి ఆరు హత్యలు చేశాడో యువకుడు. స్నేహితుడితో పాటు తన కుటుంబాన్ని ఒక్కొక్కరిని ఒక్కోచోట హతమార్చాడు. వారం వ్యవధిలోనే ఆరు హత్యలు చేశాడు. ఈ ఘటన నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. కాగా నిందితుడు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అనుచరుడు కావడం గమనార్హం.

వివరాలు మెయిన్‌లో..

క్రీడా పరికరాల పంపిణీ



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఖానాపూర్ గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి మోహన్ ఆధ్వర్యంలో సోమవారం యూత్ సభ్యులకు క్రికెట్ కిట్లు, వాలీబాల్ సెట్లు తదితర క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ, యూత్ సభ్యులు వినోద్, సతీష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి నిర్విరామ కృషి

- పిప్రి సర్పంచ్



మాట్లాడుతున్న పిప్రి సర్పంచ్

నవతెలంగాణ-ఆర్మూర్

మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి సహాయ సహకారాలతో గ్రామ అభివృద్ధికి నిర్విరామ కృషి చేసినట్లు పి ప్రీ గ్రామ సర్పంచ్ ఆశాపురం దేవి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని పిప్రీ గ్రామ పంచాయతీలో సోమవారం గ్రామ పంచాయతీ పాలక వర్గంతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పాలక వర్గం వార్డు సభ్యుల సహాయ సహకారాలతో గ్రామంలో నెలకొన్న సమస్యలు తీర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో వార్డుల సభ్యులు, పంచాయతీ కార్యదర్శి మురళి కాంత్, కారోబార్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-మోర్తాడ్

మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పనిచేయడానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పెద్దన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కామర్స్ సబ్జెక్టు వేకెన్సీ ఉన్నట్లు పేర్కొన్నారు. లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు 55శాతం మార్కులు, యుజిసి, నెట్,సెట్, పిహెచ్‌డీ అర్హత కలిగిన వారు ఈనెల 19 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 20న దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ



కార్మికులకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-బాల్కొండ

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కిసాన్‌నగర్‌లో కార్మికులకు, హమాలీలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కిసాన్ నగర్‌లోని సిమెంట్ పైప్ కంపెనీ, ఆర్డి పటేల్ డిడి కంపెనీ కార్మికులకు, రైస్ మిల్లులో హమాలీలకు, కార్మికులకు చలి నుండి రక్షణకు దుప్పట్లు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవాకార్యక్రమాల గురించి చాకు లింగం వివరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాగర్ రెడ్డి, కార్యదర్శి దినేష్ పటేల్, జిల్లా అధ్యక్షుడు చాకు లింగం, ముప్కాల్ ఏఎస్సై సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ రూరల్ మండలం గూపన్‌పల్లి డివిజన్లో గల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త ఏ.రాజన్న సతీమణి మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వారి ఇంటి వద్దకు వెళ్లి పార్థీవ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మనోధైర్యం కోల్పోవద్దని, అండగా ఉంటానని ఆయన భరోసానిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

న్యాక్ సర్టిఫికెట్లు, పెండింగ్ అలవెన్సులు వెంటనే చెల్లించాలి

- బీఆర్ఎస్ నాయకులు మల్యాల గోవర్ధన్



ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

న్యాక్, మరియు కార్మిక శాఖ ఆధ్వర్యంలో వృత్తిలో నైపుణ్యం నేర్పేందుకు భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ పూర్తయిన అనంతరం కార్మికులకు ఇవ్వాల్సిన పారితోషకం, సర్టిఫికెట్లను వెంటనే అందజేయాలని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. 2022 డిసెంబర్ 12న శిక్షణ పూర్తి చేసుకొని సంవత్సరం గడుస్తున్న న్యాక్, కార్మిక శాఖ అధికారుల సమన్వయ లోపం కారణంగా ఇప్పటివరకు సర్టిఫికెట్ గాని పారితోషకంగాని చెల్లించకపోవడం సరికాదని అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న కార్మికులకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్మిక శాఖ అధికారి దీర్ఘకాలిక సెలవులో ఉండటం వల్ల పని వాయిదా పడుతూ వస్తుందని, మరొక అధికారిని కేటాయించి, సర్టిఫికెట్లను, వారితోషకాలను వెంటనే అందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు సంజీవ్, శివకుమార్, హైదర్, సారిక, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధులో దోపిడీపై విచారణ జరిపించాలి : బీఎల్‌ఎఫ్

- సొమ్ము రికవరీ చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

రైతు బంధు పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సొమ్ము కాజేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల నుండి వందల కోట్ల రూపాయలను రికవరీ చేయాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్-బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు అబ్బగోని అశోక్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వానికి సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రైతు బంధు పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతు బంధు ముసుగులో రైతు బంధు పేరుతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసిన అందరిపై ఆర్థిక నేరాలకు పాల్పడిన సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి కాజేసిన సొమ్మును వసూలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి బిఎల్ఎఫ్ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

ప్రతిభ చాటి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- అంతర్జాతీయ క్రీడా పోటీల్లో రాణించిన విద్యార్థికి కలెక్టర్ అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ఆర్మూర్/సిరికొండ

అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలో అద్భుత ప్రతిభను చాటిన నిజామాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలుర) విద్యార్థి అమర్ సింగ్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అభినందించారు. హెచ్.ఈ.సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అమర్‌సింగ్ ఇటీవల జరిగిన ఇండో-నేపాల్ ఇంటర్నేషనల్ రూరల్ గేమ్స్ - 2023 (ఆర్.జీ.ఎఫ్.ఏ) క్రీడా పోటీల్లో కబడ్డీ విభాగంలో పాల్గొన్నాడు. అద్భుత ప్రతిభను కనబరుస్తూ జట్టుకు విజయాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించి మొదటి బహుమతి కింద బంగారు పతకాన్ని దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘురాజ్ నేతృత్వంలో సదరు విద్యార్థి ఐ.డీ.ఓ.సీలో జిల్లా పాలనాధికారిని కలిశాడు. అమర్ సింగ్‌ను కలెక్టర్ అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ప్రతిభను చాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. సదరు విద్యార్థికి డీఐఈఓ రఘురాజ్ నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం.ఎస్.వి.ప్రసాద్, శివవ్వా, అమర్ సింగ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక

సిరికొండ: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజారామ్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఇంటర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో సిరికొండ మండలం మోడల్ స్కూల్ విద్యార్థులు 600మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో గెలుపొందిన జి . రక్షిత్, శివకుమార్, 60 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయ స్థానంలో నిలిచిన ఈ ముగ్గురు జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎన్నికయ్యారు జనవరిలో గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ సునీత, పీడీ కిషన్ తెలిపారు



సిరికొండ :అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు మగ్గిడి ఇద్దరు ఎంపిక



ఆర్మూర్: ఈనెల 24నుండి 30వరకు తమిళనాడు రాష్ట్రంలో తిరువళ్లవార్‌లో జరిగే 17సంవత్సరాల బాలికల వాలీబాల్ ఛాంపియన్షిప్‌కు మగ్గిడి గ్రామానికి చెందిన సుంకరి అమూల్య తౌడిశెట్టి సంజన ఎంపిక అయినట్టు వ్యాయామ ఉపాధ్యాయులు మధు సోమవారం తెలిపారు. ప్రస్తుతం అమూల్య సుద్దపల్లి సోషల్ వెల్ఫేర్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా సంజన జ్యోతిరావు పూలే జూనియర్ కాలేజ్, దాస్‌నగర్‌లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతుంది. వీరి ఎంపిక పట్ల జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ సంగీతరావు, వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ మల్లేష్ గౌడ్, మగ్గిడి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత, సర్పంచ్ నర్సయ్య, వీడిసి సభ్యులు, సుద్దపల్లి రెసిడెన్షియల్ పీఈటి లత, దాస్‌నగర్ ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, పీఈటీ రజిత, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



ప్రజావాణి నిర్వహిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 66 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, డీఆర్డీఓ చందర్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేస్తూ, ప్రజావాణి సైట్ లో పూర్తి వివరాలు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు



పూజలు చేస్తున్న భక్తులు

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని మైలారం గ్రామంలో పెద్దమ్మ ఆలయంలో ఘనంగా పెద్దమ్మ తల్లి 27వ వార్షికోత్సవాలు నిర్వహించారు, అధిక సంఖ్యలో భక్తులు బోనాలు తీసి ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. కోరిన కోరికలు నెరవేరాలని భక్తులు పూజలు నిర్వహించారు. యజ్ఞం, హెూమంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కొనుగోలు, సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి



పోస్టర్లు విడుదల చేస్తున్న సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆన్ లైన్ విధానంలో వస్తువులు లేదా సరుకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులకు సైబర్ నేరాల పట్ల అవగాహన తప్పనిసరి అని ఇన్‌స్పెక్టర్ ముఖీద్ పాషా అన్నారు. ఈ నెల 18 నుండి 24 వరకు జాతీయ వినియోగదారుల హక్కుల వారోత్సవాల సందర్భంగా ప్రారంభం రోజున సోమవారం ఈ కామర్స్, సైబర్ నేరాలు, జాగ్రత్తలపై నిజామాబాద్ సైబర్ పోలీస్ స్టేషన్లో దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. నిజామాబాద్ సైబర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ యం.డి. ముఖీద్ పాషా, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కామర్స్ ఆన్ లైన్ విధానంలో వస్తువులు లేదా సరుకులు కొనుగోలు చేస్తున్న వినియోగదా రులకు సైబర్ నేరాల పట్ల అవగాహన తప్పనిసరి అని అన్నారు. కాబట్టి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ద్వారా కాలేజీ స్థాయిలో యువతకు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. ప్రస్తుత జాతీయ వినియోగదారుల ఉత్సవాలకు ప్రధాన అంశంగా (థిమ్)గా 'ఈ-కామర్స్‌లో వినియోగదారుల హక్కుల పరిరక్షణ' ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభమైన చైతన్య కార్యక్రమాలు డిసెంబర్ 24న ముగింపు ఉత్సవం డిల్లీలోని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ద్వారా నిర్వహించబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారుల సమన్వయ సమితి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, కార్యదర్శులు మహదేవ్ శ్రీనివాస్, అల్లూరి సందీప్, సైబర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది యండి. సిద్దికి, డి. శ్రీనివాస్, యండి. అజార్, పి. శ్రీరాం, పి.సురేష్ పాల్గొన్నారు.

నిరంతర విప్లవ శ్రామికుడు కామ్రేడ్ మల్లన్న

- సీపీఐఎంఎల్ ప్రజాపంథా



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా సీనియర్ నాయకులు వి మల్లన్న నిరంతర విప్లవ శ్రామికుడు, విప్లవ ఉద్యమ మార్గదర్శి అని, చిరస్మరణీయుడని ప్రజాపంథా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు ప్రభాకర్ కొనియాడారు.

సోమవారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్ లో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో, డివిజన్ కార్యదర్శి దేవారం అధ్యక్షతన జరిగిన మల్లన్న సంస్మరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరు అయి మాట్లాడారు. నాటకాల ద్వారా, వేదికలపై శాస్త్రీయ మ్యాజిక్ ప్రదర్శనల ద్వారా నిరంతరం విప్లవ శ్రేణులను, ప్రజలను చైతన్యం చేసిన గొప్ప విజ్ఞాన కరదీపం అని అన్నారు. దోపిడీ లేని సమాజం కోసం, కులం మతం లేని రాజ్యం కోసం నిత్యం పరితపించిన గొప్ప వ్యక్తిత్వం కామ్రేడ్ మల్లన్న అని తెలిపారు. అన్నారు. నేడు మత ఉన్మాదం పెరిగి తినే ఆహారం, కట్టుబట్టపై ఆంక్షలు తెస్తున్న మత దురహంకారంపై యుద్ధం చేయడమే మల్లన్నకు నిజమైన నివాళి అర్పించిన వాళ్ళం అవుతామని అన్నారు. విప్లవ రాజకీయాలను ముందుకు తీసుకుపోవడం, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా కృషి చేయడమేనని అయన ఆశయ సాధనకోసం అందరం పోరాడాడమే కర్తవ్యంగా పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ పౌరాహక్కుల సంఘము జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ కొంగర. శ్రీనివాస్, ఐఎఫ్టియు జిల్లా ముత్తెన్న మాట్లాడారు. పిఓడబ్ల్యుజిల్లా సహాయకార్యదర్శి సత్తెక్క, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా ఆర్మూర్, భీంగల్, సిరికొండ, ధర్పల్లి, మోర్తాడ్, కమ్మర్‌పల్లి కార్యదర్శులు, పివైఎల్ జిల్లా అధ్యక్షులు అనీస్, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి దుర్గప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన నలంద పాఠశాల విద్యార్థులు



నవతెలంగాణ-ఆర్మూర్

ఈ అభ్యాస్ అకాడమీ హైదరాబాద్ వారు ఈనెల 6న నిర్వహించిన ఏ మ్యాట్ ఐఐటీ పరీక్షలో విద్యార్థులు స్టేట్ 2,3,4,5,6,8,10,12,13,15,16,19, 20,21,22,25,28,30,35ర్యాంకుల సాధించారని కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపల్ సాగర్ లు సోమవారం తెలిపారు. ఇట్టి ఏమ్యాట్ ఐఐటీ, ఒలంపియాడ్‌లలో ర్యాంక్ సాధించిన భావన, స్వజన్, అనన్య, రక్షిత, అక్షయ, రిషి, హర్షిని, సాయి తేజ, మిధున, సంకీర్తన, హరిణి, సహస్ర, వీక్షణ, అభియ నాజ్ , మాన్విత, కీర్తి రెడ్డి, మేఘన, అజయ్, హరిణి రిసీవర్ధన్ బాలాజీ వేద వ్యాస్ నిలేష్ సాకేత్ హనీ రెడ్డి, స్ఫూర్తి, ఆరాధ్య స్నేతు, హృదయాశ్రీ, సుకేష్ణ, భావన, అర్హన్, ప్రణీత్, రాజారెడ్డి, ధనిష్, సాయివర్ధన్, యశ్వంత్, అగస్య,నితీశ మెరిట్ సర్టిఫికేట్ అందజేస్తూ హైదరాబాద్ మార్చ్ లో ఈ అభ్యాస అకాడమీ వారు ఫెలిటేషన్ చేయనున్నారని తెలిపారు. ఐఐటీ ఇంఛార్జి టీచర్ హన్మండ్లు, ప్రవీణ్, అక్షయ్ ఉపాధ్యాయులను యాజమాన్యం అభినందించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్



వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పొశమైన మహేష్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ విద్యారంగ సంస్థల్లో బోధన సిబ్బంది, సరియైన మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించడం వల్ల అనేక మంది విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ కారణంగా విద్యార్థులు ఉన్నత విద్య చదవడానికి గాని ఉద్యోగాలకు గాని దరఖాస్తు చేసుకోలేక చదువు మధ్యలో ఆపేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ సంస్థలను పట్టించుకోకపోవడం వల్ల సమస్యలకు నిలయంగా మారిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పుడు నూతనంగా ఎన్నికైన ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు విశాల్ నగర ఉపాధ్యక్షులు వేణు, గణేష్ నగర నాయకులు మారుతి, కార్తీక్, శివ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్‌డేని విజయవంతం చేయండి



నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షన్ అనేది ఉద్యోగి ప్రాథమిక హక్కుగా గుర్తించిన సుప్రీంకోర్టు తీర్పును దేశవ్యాప్తంగా పెన్షనర్స్ డేగా నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అందులో భాగంగా నిజామాబాద్‌లో న్యూ అంబేద్కర్ భవన్ నందు మంగళవారం ఉదయం 10:30 గంటలకు తెలంగాణ ఆల్ పెన్షనర్, రిటైర్డ్ పర్సన్స్ ఆధ్వర్యంలో పెన్షన్స్ డేను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి తెలంగాణ రాష్ట్ర ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కోదండరాం, జిల్లా అధికారులు, ఇతర పెద్దలు హాజరవుతున్నట్లు పెన్షనర్లందరూ ఈ సభకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
మంగళవారం | డిసెంబర్ 19, 2023 | www.navatelangana.com

చెరువులో పడి ఒకరు మృతి



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో గల చెరువులో పడి ఒకరు మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగరాజు (42) వంటలు చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి తిరిగి రాకపోయేసరికి కుటుంబీకులు, బంధువులు గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. వంటలు చేయడానికి వెళ్లి ఉండవచ్చునని కుటుంబీకులు భావించారు. సోమవారం జంగంపల్లి చెరువులో స్థానికులు గమనించి తేలియాడుతున్న శవాన్ని బయటకు తీసి నాగరాజుగా గుర్తించి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు.

శనగ పంట పరిశీలన


శనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట్ శివారులో సంజీవరెడ్డి, నజీర్ పాషా శనగ పంటను సోమవారం మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి పరిశీలించారు. శనగ వచ్చే తెగుళ్లను పురుగులను పరిశీలించినట్లు తెలిపారు. శనగలో వచ్చే ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోలేడ్ (సి.ఓ.సి)ని పిచికారీ చేయాలని సూచించారు. శనగలో వచ్చే పచ్చపురుగు నివారణకు ఇమామెక్సిన్ బెంజోయెట్‌ను పిచికారీ చేయాలని పేర్కొన్నారు. పంట పరిశీలనలో స్వామి, సంజీవరెడ్డి, నజీర్‌పాషా, విస్తీర్ణ అధికారి శీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

నవతెలంగాణ-కామారెడ్డి



ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన ఫిర్యాదులను, వినతులను ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ స్వీకరించి పరిశీలించిన అనంతరం ఆ అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ సిఫారసు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసాలకోర్చి వస్తున్న ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఫిర్యాదులను శాఖల వారీగా స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 34, జిల్లా పంచాయతీ అధికారికి 15, జిల్లా హౌసింగ్ శాఖకు 10, విద్యుత్ శాఖకు 3, జిల్లా వ్యవసాయ శాఖ మూడు, డిఆర్‌డిఓ రెండు, జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి, బీసీ కార్పొరేషన్, జిల్లా విద్యాశాఖ, మున్సిపల్, ఎస్పీ కార్యాలయం, సర్వే ల్యాడ్ రికార్డింగ్, స్త్రీ శిశుసంక్షేమ శాఖ, కలెక్టరేట్‌కు ఒక్కొక్క ఫిర్యాదు చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, డిఆర్‌డిఓ సాయన్న, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి విగ్రహం ఊరేగింపు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, అయ్యప్ప స్వామి మాలదారుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి విగ్రహం ఊరేగింపును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వాములు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఆటపాటలతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలదారులు అబ్బయ్య, సంతోష్, రామస్వామి, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

- **తహశీల్దార్‌కు వినతి**


తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఆటోడ్రైవర్లు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఆటోడ్రైవర్‌ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బిఎంఎస్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో తహశీల్దార్ సురేష్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిఎంఎస్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం పెట్టడంతో తమ ఆటో కార్మికుల కుటుంబాల జీవనం దయనీయంగా మారిందని అన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతీ ఆటో డ్రైవర్‌కు నెలకు కనీసం రూ.15000 వేలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బిఎంఎస్ ఆటో యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.శివకుమార్‌గౌడ్, ఎల్లారెడ్డి ఆటో యూనియన్ అధ్యక్షులు కె.రాజు, సెక్రటరీ అజీమొద్దీన్, సాబేర్, మోసిన్, శాబొద్దీన్, సాయిలు, 50 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నారుమడుల పరిశీలన



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామంలో రైతులతో కలిసి ఏఈఓ రాజాగౌడ్ వరి నారుమడులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నారుమళ్లలో జింకు లోపం గుర్తించినట్టు తెలిపారు. ఈ జింకులోపం నివారణకు జింకు సల్ఫేట్‌ను ఒక లీటర్ నీటికి 2.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అదేవిధంగా నాటు వేయడానికి వారం రోజుల ముందు ఒక ఎకరానికి సరిపోయే నారుమడికి ఒక కేజీ కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు వేయాలని రైతులకు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఏఈఓ రాజాగౌడ్‌తో పాటు కోపు చింతల సాయిలు, సంబారపు సాయిలు, పుర్ర నారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ఘన స్వాగతం

నవతెలంగాణ-బోధన్/రెంజల్/ఎడపల్లి

శాసనసభ ఎన్నికలలో విజయం సాధించి ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బోధన్‌కు తొలిసారిగా విచ్చేసిన బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరు సుదర్శన్‌రెడ్డిని సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా ఆహ్వానం పలికారు. ఆచన్‌పల్లి వద్ద భారీ గజమాలతో ఆయనకు బైక్‌ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం బోధన్ పట్టణంలోని రవి గార్డెన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎల్లయ్య, కౌన్సిలర్ శరత్‌రెడ్డి, సీనియర్ నాయకులు గంగాశంకర్, పాషా మోహినోద్దీన్, రమేష్, ఖలీల్, హరికాంతచారి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

బోధన్ ఎమ్మెల్యేకు గజమాలతో సన్మానం..

రెంజల్: బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రొద్దుటూరి సుదర్శన్‌రెడ్డిని రెంజల్ మండల నాయకులు నెహ్రూనగర్ వరకు వెళ్లి గజమాలతో ఘనంగా సన్మానం చేసి స్వాగతం పలికారు. ఇటీవల బోధన్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన మొదటిసారిగా నియోజకవర్గానికి రావడంతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బైక్‌ర్యాలీని నిర్వహించి ఆయనతో బోధన్ వరకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి నాగభూషణంరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు జి.సాయిరెడ్డి, గయా సోదిన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు సురేందర్‌గౌడ్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎల్ రాజు, సాయిబాబాగౌడ్, సిహెచ్.రాములు, ధనుంజయ్, జావిద్ ఉద్దీన్, లచ్చేవార్ నితీన్, గంగాకృష్ణ, కురుమే శ్రీనివాస్, సగ్గు వెంకటి, సురేష్, సయ్యద్ సల్మాన్, అంజయ్య, గోజ్జా భూమయ్య, యువజన నాయకులు కార్తిక యాదవ్, సిద్ధ సాయి, శంషాద్దీన్, గైని సాయిలు, అశోక్, వేణు, కిరణ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం..

ఎడపల్లి: ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి సారంగాపూర్ పరిధిలోగల హనుమాన్ ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బోధన్ వరకు మోటర్ సైకిల్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. ఎడపల్లి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపాన బోధన్ ఎమ్మెల్యేకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి గజమాలతో సత్కరించారు. భారీగా పోలీస్ బందోబస్తు మధ్య ఎమ్మెల్యేతో బోధన్ వరకు ర్యాలీగా బయలుదేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు రామ్మోహన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈరెంటి లింగం, ఎడపల్లి మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, నెహ్రూనగర్ సర్పంచ్ అమానుల్లా షరీఫ్, బంజ కామప్ప, మచ్కూరి గంగాధర్, బోధన్ నియోజకవర్గ కన్వీనర్ ఎస్.కె ఫారాన్, పోశెట్టి, తాటి సంతోష్‌గౌడ్, సరిదాస్, నీరడి రవికుమార్, సున్నపు ఓడ్డేన్న ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల..

మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎడపల్లి మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. బోధన్ ఎమ్మెల్యేగా సుదర్శన్‌రెడ్డి గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఆయన ఎమ్మెల్యేగా మొట్టమొదటిసారిగా బోధన్ వైపు రావడంతో నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఎడపల్లిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎడపల్లి మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, మచ్కూరి గంగాధర్, బంజా కామప్ప, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఎడపల్లిలో...

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని భవానిపేట్ ఉన్నత పాఠశాలకు చెందిన దీపిక అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి కోకో పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు తెలిపారు. 42వ రాష్ట్రాస్థాయి కోకో పోటీలకు సంబంధించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బాలబాలికల జట్ల ఎంపికను ఉప్పల్వాయి ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ ఎంపికలో భవానీపేట్ ఉన్నత పాఠశాలకు చెందిన దీపిక ఎంపికవడంతో ఆ క్రీడాకారిణిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదన్ మోహన్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి 23 వరకు ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కొమరాంభీమ్ ఆసిఫాబాద్‌లో పాల్గొంటారని ఆయన వివరించారు.

బస్సు ఢీకొని ఒకరి మృతి



నవతెలంగాణ-పెద్దకొడప్గల్

మండలంలోని జగన్నాథ్‌పల్లి గ్రామ శివారులో గల రాజస్థాన్ దాబా హొటల్ సమీపంలోనీ జాతీయ రహదారి 161పై బైరి సత్యగౌడ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి బస్సు ఢీకొట్టింది. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు ఎస్ఐ కొనారెడ్డి తెలిపారు. డ్రైవర్ జహంగీర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎడపల్లిలో సర్ సీవీ రామన్ జయంతి వేడుకలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని ఎడపల్లి ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సివి రామన్ జయంతి వేడుకలను ఉపాధ్యాయ బృందం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతిని పురస్కరించుకొని పాఠశాలలోని బాలబాలికలకు మండల స్థాయి ముగ్గుల, వ్యాసరచన, సంగీతం, పాటల పోటీలను నిర్వహించారు. రెంజల్ మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు విజయ్ ఆనంద్‌రావు ఈ పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన బాలబాలికలకు అధ్యాపక బృందం బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో జానకంపేట్, మంగల్‌పహాడ్ అధ్యాపకులు నరసింహారెడ్డి, తూటికూర శ్రీనివాస్‌రెడ్డి, ఎడపల్లి మండల పరిధిలో గల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాల అధ్యాపకులు శంకర్‌గౌడ్‌తో పాటు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు బాలబాలికలు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- **సీఐటీయూ ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వినతి**

నవతెలంగాణ-ఎడపల్లి

జిల్లాలోని గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఎడపల్లిలో బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో ఉన్న గ్రామపంచాయతీ కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నెలవారి జీతాలు తక్కువగా వస్తున్నందున ఆర్థిక సమస్యల్లో కూరుకుపోయామని వివరించారు. ఆయన వెంట సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పద్మ, కుంట సంతోష్, సాగర్ కార్మికులు పాల్గొన్నారు.

లంబాడి సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

- **లంబాడి ఐక్యవేదిక జిల్లా యూత్ ఇన్చార్జి అనిల్ నాయక్**



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోనే అతిపెద్ద సామాజిక వర్గమైన లంబాడీలకు మంత్రి వర్గంలో చోటుకల్పించి ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించాలని లంబాడి ఐక్యవేదిక కామారెడ్డి జిల్లా యూత్ ఇన్చార్జి అనిల్ నాయక్ సోమవారం కోరారు. రాష్ట్రంలో లంబాడిల అత్యధిక జనాభా శాతం ఉన్న 60 నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించిందన్నారు. రాష్ట్రంలోని బంజారాలు ఏకపక్షంగా ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని, గెలుపొందిన ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఉంటూ ఆదివాసి, గిరిజన ప్రజా సమస్యలపై దృష్టి సారించి గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-కామారెడ్డి

బిబిపేట్ గ్రామానికి చెందిన మ్యాదారి లక్ష్మి కూతురు భాగ్యలక్ష్మి వివాహం ఈ నెల 21న ఉండటంతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో బీఆర్‌ఎస్ వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి ఈ విషయాన్ని ఎస్‌ఆర్‌ఎఫ్ ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఫౌండేషన్ ప్రతినిధులు స్పందించి పుస్తె, మట్టెలు, 50కిలోల సన్న బియ్యం అందజేస్తామని చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్‌ఆర్‌ఎఫ్ ఫౌండేషన్ సభ్యులు ఆకుల రాములు, పాత యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వికాసిత్ భారత సంకల్ప యాత్ర


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

కేంద్రప్రభుత్వం సంక్షేమ ఫలాలను ప్రజలందరికీ అందించేందుకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అధికారులు, ప్రజాప్రతినిధులతో అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని దండిగుట్ట, దూపల్లి గ్రామాలలో సర్పంచులు ముళ్ళపూడి శ్రీదేవి, శనిగరం సాయిరెడ్డి అధ్యక్షతన ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజా సంక్షేమ ఫలాలకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. అనంతరం ప్రొటెక్టర్ ద్వారా ఐదు రకాల శాఖల అధికారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీఓ గౌసుద్దీన్, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ ప్రమోదిత, హెచ్ఈఓ శ్రావణ్ కుమార్, వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి, డిప్యూటీ తహసీల్దార్ శశిభూషణ్, ఇన్చార్జి ఏపిఎం భాస్కర్, గ్రామ కార్యదర్శులు చారి, సిహెచ్.సాయి, కారోబార్లు కిరణ్‌రెడ్డి, సాయిలు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టిఎన్‌జీవోస్ నాయకులు



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డిని టిఎన్‌జీ వోస్ నాయకులు సోమ వారం మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఇటీవ ల జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికలలో కామారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులుగా నూత నంగా ఎన్నికై, మొట్టమొదటిసారి కామారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయానికి విచ్చేసిన కాటిపల్లి వెంకటరమణారెడ్డిని కామారెడ్డి జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవోస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నరాల వెంకటరెడ్డి అధ్యక్షతన వారి బృందం కాటిపల్లి వెంకటరమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బి.సాయిలు, ఉపాధ్యక్షులు బి.రాజేశ్వర్, జాయింట్ సెక్రటరీలు గణేష్, రాజ్యలక్ష్మి, కామారెడ్డి అర్బన్ తాలూకా కార్యదర్శి కె.శివకుమార్, ఉపాధ్యక్షులు ఎం.కిషన్, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉద్వీర్ సింగ్‌పై కేసు ఎత్తివేయాలి

- **అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మల గంగాధర్**

నవతెలంగాణ-ఎడపల్లి

రైతు నాయకుడు ఉద్వీర్‌సింగ్‌పై ఉపా చట్టంలో భాగంగా అక్రమ నిర్బంధం, నిషేధం కేసును ఎత్తివేయాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మల గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ మోతిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం గుమ్మల గంగాధర్ మాట్లాడుతూ.. ఢిల్లీ పోలీసులతో సహా కేంద్రప్రభుత్వ దర్యాప్తు సంస్థల ఉద్దేశపూర్వక అన్యాయమైన చర్యల కారణంగా (ఎస్‌కేయం)నాయకులు అనేకమంది ఇటీవల అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. రైతు ఉద్యమ కారులపై కేసులు బనాయించేందుకు కుట్ర చేసిన వారిపైన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన హామీలను సముచిత గౌరవంతో సాగించేలా తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు గుమ్మల గంగాధర్ పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో శ్రీపతి మల్లేష్, కట్ట రవి, సుదర్శన్, హన్మండ్లు తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన గోప్య తాండ సర్పంచ్ భూక్య రాంచందర్ కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంతోష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వెల్మ భాస్కర్ రెడ్డి, బాలరాజ్ నాయక్, బన్నజీ నాయక్, బలరాం ,బాలకిషన్ ,శ్రీను ,సంతోష్ ,జగన్ తదితరులు పాల్గొన్నారు.

అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల నీటి విడుదల



నవతెలంగాణ-ఆర్మూర్

ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆదేశానుసారం సోమవారం ఉమ్మెడ శివారులో గల అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల నుండి సోమవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ ఎస్ఈ యశస్వి, అధికారులు మాట్లాడుతూ.. యాసంగి పంట కోసం నీటిని విడుదల చేశామని, ఈ ఎత్తిపోతల ద్వారా 38,792ఎకరాలకు నీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఈ ఈ భాను, డిఈఈ రవి, ఏఈఈ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కలిసిన వ్యవసాయశాఖ అధికారులు



భూపతిరెడ్డిని సన్మానిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, నిజామాబాద్ డివిజన్ ఏడిఏ ప్రదీప్ కుమార్ అధ్వర్యంలో సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా పుల బోకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా, రూరల్, మండలాల్లో వ్యవసాయ పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిచ్‌పల్లి వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు, ఇందల్‌వాయి, ధర్పల్లి వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, నిజామాబాద్ రూరల్ వ్యవసాయ శాఖ అధికారి మావో- జాదవ్, జక్రాన్‌పల్లి ఎంఏవో దేవిక, వెంకటేష్, తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

మహంతంలో ఘనంగా భీమన్న పండుగ



భీమన్న పండుగలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని మహంతం గ్రామంలో ఆదివాసి నాయకపోడు గిరిజన ఆరాధ్య దైవం భీమన్న పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపుతో సంబరాలు చేసుకున్నారు. ఐదు రోజులపాటు జరిగే భీమన్న పండుగను కులస్తులంతా భక్తిశ్రద్ధలతో కలిసికట్టుగా పండగ సంబరాలు నిర్వహిస్తారని మండల ఆదివాసి నాయకపోడు మాజీ మండల అధ్యక్షులు సుంకరి రాజు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాధర్ రెంజల్ ఎపిఓ రమణ, కిషోర్, రాజేశ్వర్, అశోక్, గంగాధర్, రవి, శ్రీనివాస్, సాయి రెడ్డి, మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'అమ్మ-నాన్న, గురువు'ల ప్రాముఖ్యతపై అవగాహన



శతక పద్యార్చనలో పాల్గొన్న కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల ఆవరణలో "అమ్మ-నాన్న గురువు శతక పద్యార్చన" కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం "తాన" వంద వరకు ఉన్న తెలుగు సంఘాల సమన్వయంతో 'వందే విశ్వమాతరం' పేరుతో చేపట్టిన 'శాంతి సద్భావన యాత్రలో భాగంగా చిగురుమల్ల శ్రీనివాస్ రచించిన అమ్మ శతకం, నాన్న శతకం, గురువు శతకం పద్యాలను విద్యార్థులు చదివి వినిపించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఈ సందర్భంగా అమ్మ-నాన్న, గురువుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోట ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్ చవాన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శతక పద్యార్చనలో పాల్గొన్న తడపాకల్ విద్యార్థులు



శతక పద్యార్చనలో పాల్గొన్న తడపాకల్ విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల

తానా సంఘం, వందే విశ్వమాతరం సంయుక్త ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలోని సుమారు పదివేల మంది విద్యార్థులతో సామూహికంగా అమ్మ, నాన్న, గురువు శతకాలలోని పద్యధారణ కార్యక్రమంలో భాగంగా తడపాకల్ పాఠశాలలోని సుమారు 20 మంది విద్యార్థులు పాల్గొని శతక పద్యాలను ధారణ చేశారు. ఈ సందర్భంగా తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ... చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన అమ్మ నాన్న, గురువు శతక పద్య ధారణ చేయడం ద్వారా విద్యార్థులలో తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవం వినయ విధేయతలు ఏర్పడుతాయని, విద్యార్థులలో నైతిక విలువలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావేద్, సుధాకర్, రాములు గంగాధర్, కృష్ణ ప్రసాద్, స్వప్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా పీజీ సెమిస్టర్ పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ పరీక్షలు ప్రశాంతంగా తొలి రోజు సోమవారం నిర్వహించామని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ ఎం. అరుణ పేర్కొన్నారు. ఎంబీఏ, ఎంసీఏ మూడవ సెమిస్టర్, రెగ్యులర్, ఐఎంబిఏ తొమ్మిద సెమిస్టర్ పరీక్షలకు మొత్తం విద్యార్థులు 537 మంది ఉండగా ఇందులో పరీక్షకు హాజరైన వారు 506 మంది విద్యార్థులు, 31మంది విద్యార్థులు గైరాజరయ్యారని పరీక్షల నియంత్రణ అధికారిని ప్రకటనలో తెలిపారు.

35 శాతం సబ్సిడీపై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు

- మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు
- ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ బాజన్న

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

35 శాతం సబ్సిడీపై మహిళా సంఘాలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మించుకోవచ్చని ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ బాజన్న సోమవారం అన్నారు. మండలంలోని బాలనగర్ గ్రామపంచాయతీలో వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ఇన్చార్జి ఎంపీడీవో బ్రహ్మానందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఐకెపి నుంచి కమ్యూనిటీ కోఆర్డినేటర్ మహిళా సంఘాలకు అందిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ దీన దయాల్ అంత్యోదయ యువజన నేషనల్ రూరల్ లైలీవుడ్ మిషిన్ కింద మహిళా సంఘాలకు 5 లక్షల నుంచి 20 లక్షల రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మహిళా సంఘాలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు 35 శాతం సబ్సిడీతో లక్ష రూపాయల నుంచి కోటి రూపాయల వరకు ఆహార శుద్ధి యంత్రాలకు రుణాలు ఇప్పించడం జరుగుతుందని అన్నారు. ఎన్నారైలెం కింద చిన్న వ్యాపారులకు మండల సమైక్య నుంచి 50 పైసల వడ్డీతో 40 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు న్యూ ఎంటర్ప్రైజెస్ ఏర్పాటుకు బ్యాంకు ద్వారా రుణాలు అందించి వ్యాపారం ఏర్పాటు చేసుకునేందకు ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పారు. అనంతరం వికసిత భారత్ సంకల్ప యాత్రకు వచ్చిన మహిళలందరికీ గ్రామ ప్రజలకు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నిహారిక, ఇన్చార్జ్ ఎంపీడీవో బ్రహ్మానందం, ఏపిఎం రవీందర్ రెడ్డి, ఏపీవో రవి, వైద్య సిబ్బంది ఏఎన్ఎం సుజాత, హెల్త్ సూపర్వైజర్లు అంగన్వాడి కార్యకర్తలు, ఆశ వర్కర్లు మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమ్యూనిటీ కోఆర్డినేటర్ భాజన్న

విజయ్ హైస్కూల్లో బాలకవి సమ్మేళనం



నిజామాబాద్‌సిటీ : కవిసమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు



ఆర్మూర్‌లో..

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/ఆర్మూర్

విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను, కవితాశక్తిని వెలికితీసి సాహిత్య సృజనను నేర్పించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం మాదిరిగానే సోమవారం విజయ్ హై స్కూల్లో బాలకవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వైదిక సిద్ధాంత జ్ఞాత, పురోహితులు తిరుమల శ్రీనివాస్ ఆర్య ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనచేసి సభాధ్యక్షత వహించారు. మూడో తరగతి నుండి పదవ తరగతి వరకు మొత్తం 87 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కవితలతో అందరినీ అలరింపజేశారు. కవితా శీర్షికలో భాగంగా 3,4,5వ తరగతుల వారికి 'పొదుపు' 6,7వ తరగతుల వారికి 'ఓటు': 8,9,10వ తరగతుల వారికి నేనే ఉపాధ్యాయుడినైతే' అనే అంశాలను ఇచ్చి కవితలు రాయించారు. బాల కవులందరు సంప్రదాయ దుస్తులు ధరించి శ్రవణానందకరంగా కవితలు రాసి వినిపించి శ్రోతలను అలరించారు. గాయితో కాకుండా సోయితో కూడిన కవిత్వాన్ని వినిపించారని విద్యార్థుల సృజనాత్మకతను భాషాకౌషలాన్ని కొనియాడారు. విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత బాలకవి సమ్మేళనంలో పాల్గొన్న చిన్నారులను తిరుమల శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్మూర్ :విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను, కవితాశక్తిని వెలికితీసి సాహిత్య సృజనను నేర్పించాలనే ఉద్దేశంతో పట్టణంలోని విజయ్ హై స్కూల్‌లో బాలకవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విజయ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ టీ. కవితా దివాకర్ సభాధ్యక్షత వహించారు. మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కవితలతో అందరినీ అలరింపజేశారు. కవితా శీర్షికలో భాగంగా 3,4,5వ తరగతుల వారికి 'పువ్వు' 6,7వ తరగతుల వారికి 'శిలలు-శిల్పం' 8,9,10వ తరగతుల వారికి 'పుస్తకం' అనే అంశాలను ఇచ్చి కవితలు రాయించారు.

మహిళ అదృశ్యం



నవతెలంగాణ-నవీపేట్

పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బొమ్మ సౌమ్య (32) మూడు నెలల క్రితం అదృశ్యమైందని ఫిర్యాదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బొమ్మ ప్రసాద్‌కు నిజామాబాద్ రూరల్ మండలంలోని కొత్తపేట్ గ్రామానికి చెందిన బొమ్మ సౌమ్యతో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా సెప్టెంబర్ 20న తల్లిగారింటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిపారు. ఆచూకీ కోసం వెతికే సందర్భంలో భర్త ప్రసాద్ కు ప్రమాదం జరగడంతో ఇద్దరు పిల్లల పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

మహమ్మద్ నహీద్ అలీకి డాక్టరేట్ ప్రదానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



అభినందిస్తున్న ప్రొఫెసర్లు

తెలంగాణ యూనివర్సిటీలోని ఉర్దూ డిపార్ట్మెంట్ లో మహమ్మద్ నహీద్ అలీకి తెలంగాణ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, పాఠ్య ప్రణాళికల అధ్యక్షులు డాక్టర్ ముహమ్మద్ అబ్దుల్ ఖవి పర్యవేక్షణలో హైదరాబాద్ కె నామవార్ -సహాఫియూన్‌కి అదబి వావ్ సహాఫాతి ఖిద్మాట్ (అజాది కె బాద్)అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని తెలంగాణ యూనివర్సిటీకి సమర్పించారు. ఈ బహిరంగ వైవాకు ఎక్టర్నల్‌గా ఎగ్జామినర్‌గా ప్రొఫెసర్ డాక్టర్. సయ్యద్ అబ్దుల్ శుకుర్ పూర్వ విభాగాధిపతి ఉర్దూ విభాగం ఉస్మానియా యూనివర్సిటీ హాజరయ్యారు. భారత స్వతంత్రానంతరం హైదరాబాద్ కేంద్రంగా పనిచేసిన ప్రఖ్యాతి గాంచిన 25 మంది, జర్నలిస్టుల జీవిత విశేషాలను, సాహిత్యానికి అందించిన సేవలను వివరనాత్మకంగా అధ్యయనం చేశారు. ప్రసిద్ధి చెందిన 25 మంది జర్నలిస్టులు ఉర్దూ సాహిత్యానికి, కళల అభివృద్ధికి అందించిన తోడ్పాటును సిద్ధాంత గ్రంథంలో విపులీకరించారు. స్వతంత్రానికి పూర్వం, తర్వాత జర్నలిజంలో వచ్చిన మార్పులు ఈ సిద్ధాంత గ్రంథంలో చర్చించారని, జర్నలిజ లో ఉండే విలువలు సాహిత్యంలో ఉండే విలువలకు తేడాను, సంబంధాన్ని స్పష్టంగా వివరించాడని ఎక్టర్నల్ ఎగ్జామినల్ తెలిపారు. పరిశోధకున్ని ఆర్ట్స్ డీన్. ప్రొఫెసర్ వి. త్రివేణి సాహిత్యంపై ప్రశ్నలు అడిగి ఈ సిద్ధాంత గ్రంథం ఉద్దేశాలను జర్నలిజంలో ఉండే విధంగా అనువర్తింప చేయాలని సూచించారు. ఈసందర్భంగా టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి పరిశోధక విద్యార్థిని, పర్యవేక్షకుడిని అభినందించారు.

ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో యజ్ఞంలో పాల్గొన్న బాజిరెడ్డి

నవతెలంగాణ-మోపాల్

రాజకీయంలో గెలుపోటములు సహజమని, ఎల్లప్పుడూ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మన సత్తా చాటుదామని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మండలంలోని బోర్గం గ్రామంలో గల శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం బాజిరెడ్డి గోవర్ధన్ సతీసమేతంగా యజ్ఞ హెూమాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎప్పుడైనా యే కార్యకర్తకు కష్టం వచ్చినా తాను కానీ, జగన్ గాని అందు బాటులో ఉంటామని అన్నారు. చివరి శ్వాస వరకు నిజామాబాద్ రూరల్ ప్రజల్లోనే ఉంటానని, నాకు జగన్ ఎలాగో కార్యకర్తలు కూడా అలాగేనని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డిసిసి బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



యజ్ఞంలో పాల్గొన్న బాజిరెడ్డి దంపతులు

రాష్ట్రస్థాయి పోటీల్లో ఏకలవ్య ఆదర్శ పాఠశాల విద్యార్థుల జయకేతనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ పాఠశాలల ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన ఆటలపోటీల్లో నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి ఏకలవ్య ఆదర్శ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచారు. ఆట పోటీల్లో విద్యార్థులు అండర్-14 ఖోఖో ప్రథమ స్థానం, అండర్-17 ఖోఖో ప్రథమ స్థానం, అండర్-17 వాలీబాల్ ప్రథమ స్థానం, అండర్-19వాలీబాల్ ప్రథమ స్థానం, అథ్లెటిక్స్‌లో అండర్-19రెజ్లింగ్ ప్రథమ స్థానం, అండర్-17 షాట్ పుట్ రెండవ స్థానం, అండర్-17 వంద మీటర్ల పరుగు పందెం, రెండవ స్థానం, అండర్-17 400 మీటర్ల పరుగు పందెం రెండవ స్థానం, అండర్-19 800 మీటర్ల పరుగు పందెం మూడవ స్థానం, అండర్-19 వంద మీటర్ల పరుగు పందెం మూడవ స్థానం, అండర్-19. 400 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానం దక్కించుకున్నారు. పాఠశాలకు అత్యధిక బహుమతులతోపాటు మంచి గుర్తింపు తెచ్చినందుకుగాను, విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమని తెలుపుతూ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు. కోచ్ సుష్మ, పీఈటి సంధ్య, తోటి ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



గడ్డి వాముకు నిప్పంటుకొని నాలుగేళ్ల బాలుడు మృతి



జియాఉద్దీన్ (ఫైల్)

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామంలో సోమవారం విషాదం చోటుచేసుకుంది. స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. పాత ఇంట్లో గడ్డి వామును ఉంచగా ఇద్దరు చిన్నారులు సరదాగా ఆడుకుంటూ వెళ్లి అగ్గిపెట్టతో నిప్పంటించగా ఒక్కసారిగా ఆకస్మికంగా చెలరేగిన మంటలతో ఊపిరాడక మహమ్మద్ జియాఉద్దీన్ నాలుగు సంవత్సరాల బాలుడు మృతి చెందినట్టు తెలిపారు. డయల్ 100కు ఫోన్ రాగా హుటాహుటిన ఫైర్ సిబ్బంది, పోలీసులు చేరుకున్నట్టు తెలిపారు. మంటలు చల్లార్చేలోపే బాలుడు మృతి చెందడం జరిగిందని అన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. బాలుని తల్లిదండ్రుల, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

సేయింట్స్ ఆన్స్ చర్చ్‌లో ఘనంగా సపోజ్ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని సుభాష్ నగర్‌లోగల సేయింట్ ఆన్స్ చర్చ్‌లో రాబోయే క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఆదివారం సపోజ్ క్రిస్మస్ నిర్వహించినట్టు పారిష్ ప్రీస్ట్ రెవరెండ్ మాదాను జోసెఫ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రెవరెండ్ ఫాదర్ పేసర్ల, రాజు క్రీస్తు జన్మ ప్రాముఖ్యతను తెలిపారు. సపోస్ క్రిస్మస్ వంటి గొప్ప కార్యక్రమాల ద్వారా యువతకు పెద్దలకు చిన్నారులకు పండుగ సంబరాలు మొదలయ్యే విధంగా వారి మనసుల్లో పండగ ఉత్సాహాన్ని నింపేందుకు తోడ్పడతాయని అన్నారు. సహాయ పారిష్ రోమాల్డ్ జోసెఫ్ చిన్నారులతో కలిసి ఆటలతో పాటలతో అందరిలో హుషారు నింపి కార్యక్రమానికి వన్నె తెచ్చారు. ఈ సందర్భంగా సంఘంలోని చిన్నారులు పాటల ఈ సందర్భంగా సంఘంలోని చిన్నారులకు పెద్దలకు విడివిడిగా పాటల పోటీలు నిర్వహించినట్టు కౌన్సిల్ సభ్యులు తెలిపారు. విచారణ సభ్యులు క్రిస్మస్ స్కిట్ ప్రదర్శించడం అందర్నీ ఆకట్టుకుంది. చర్చి సభ్యులు పలువురు వివిధ వాయిద్యాల ద్వారా పాటలు పాడుతూ ఈ సపోజ్ క్రిస్మస్‌ను మరింత ఉత్సాహంగా నిర్వహించారు. నిర్మల హృదయ సిస్టర్స్ తో కలిసి కేక్ కట్ చేసిన అనంతరం విచారణ గురువులు విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం అందరూ కౌన్సిల్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోజనం చేశారు.



సపోస్ క్రిస్మస్‌లో పాల్గొన్న చిన్నారులు

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం గ్రామ శివారు ప్రాంతంలో మాజీ మంత్రి ప్రస్తుత బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారిగా నిజామాబాద్ జిల్లాలో అడుగు పెట్టిన సందర్భంగా ఆయనకు మాజీ ఎంపీపీ యాదగిరి గణస్వాగతం పలుకుతూ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ మరి కొన్ని రోజుల్లో సుదర్శన్ రెడ్డిని మంత్రిగా మనం చూడబోతున్నామని, ఆయన సేవలను అందరం వినియోగించుకుంటామని ఇటువంటి నాయకుడు మన నిజామాబాద్ జిల్లాకు దొరకడం అదృష్టమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మొట్టమొదటి సారిగా బోధన్‌కు వెళ్తుతుండగా డిచ్‌పల్లి వద్ద నిజామాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాటిపల్లి నగేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సినియర్ నాయకులు తాహెర్ బిన్ హందాన్, ఎంపిటిసి సభ్యుడు ముళ్ళంగి నర్సయ్య, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, ఇందల్‌వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, డాక్టర్ శాదుల్లా, శకిల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మా పొట్ట కొట్టొద్దు

- 15వేలు జీవనభృతి ఇవ్వండి
- ఆత్మహత్యల వరకు మా పరిస్థితి తేకండి
- ప్రభుత్వాన్ని కోరుతున్న ఆటో డ్రైవర్లు



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆటో డ్రైవర్లు



నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం మా పొట్ట కొట్టదని రూ.15వేల జీవనభృతి ఇవ్వాలని కామారెడ్డి జిల్లాలోని రెండువేల మంది ఆటో డ్రైవర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సోమవారం కామారెడ్డి జిల్లాలోని సదాశివ నగర్, రాజంపేట, బిక్కనూర్, గాంధారి, లింగంపేట్, తాడ్వాయి తదితర మండలాల నుంచి ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 20వేల మంది ఆటో కార్మికులున్నామని ప్రభుత్వం ఆర్టీసీ బస్సులు మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించడంతో తమకు గిరాకీలు లేక కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని, ఆత్మహత్యల వరకు వెళ్లకముందే ప్రభుత్వం స్పందించి తమకు నెలకు రూ.15వేల జీవనభృతిని అందించాలన్నారు. ఈ ధర్నాలో జేఏసీ నాయకులు శంకర్, కృష్ణంరాజు, భిక్కనూర్ మండల అధ్యక్షులు సిద్ధ రాములు, ఉపాధ్యక్షులు నాగులు, రాజంపేట మండల అధ్యక్షుడు మహేశ్వరం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ సమస్యలు పరిష్కరించాలి

- పీడీఎస్‌యూ
- అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి



సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్పోర్ట్స్ సమస్యలు పరిష్కరించాలని పిడిఎస్‌యూ తెలంగాణ యూనివర్సిటీ కమిటీ నాయకులు ఆకాష్, రవీందర్, అక్షయ్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ యూనివర్సిటీ పిడిఎస్‌యూ కమిటీ ఆధ్వర్యంలో అడ్మిన్ బిల్డింగ్ ముట్టడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో స్పోర్ట్స్ ఆడించకుండా నేషనల్ గేమ్స్‌కి యూనివర్సిటీ నుండి విద్యార్థులను తీసుకుపోవటం లేదని, అన్నారు. విద్యార్థులు కట్టే ఫీజులో స్పోర్ట్స్‌కి కూడా యాడ్ అవుతుందని, స్పోర్ట్స్‌కి ప్రత్యేక నిధులు కేటాయించడం లేదని, స్పోర్ట్స్‌కి వెళ్లిన క్రీడాకారులను యూనివర్సిటీ అధికారులు హేళన చేస్తూ మాట్లాడుతున్నారని అన్నారు. గ్రౌండ్‌ను క్లీన్ చేయాలని, స్పోర్ట్స్ క్యాలెండర్ ప్రకారం క్రీడాకారులను నేషనల్ గేమ్స్‌కి తీసుకుపోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహిత్, యశ్వంత్, రామకృష్ణ, హన్మాండ్లు, సాయి కృష్ణ, మణికంఠ, గంగూలీ, రాము, అశ్విత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలు ఆగండి.. కాంగ్రెస్ పాలన ప్రజలకు తెలుస్తుంది

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



మాట్లాడుతున్న బాజిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆరు నెలలు ఆగండి కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తెలుస్తుందని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సోమవారం ఖిల్లా డిచ్‌పల్లి గ్రామ బీఆర్‌ఎస్ శాఖ అధ్యక్షులు బాలేకర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నివాసంలో కలిశారు. బాజిరెడ్డి గోవర్ధన్ ఎమ్మెల్యే పదవిలో ఉన్నా.. లేకున్నా.. బీఆర్ ఎస్ పార్టీని, మిమ్మల్ని వదిలి , ఎక్కడికి, ఏపార్టీలోకి వెళ్ళబోమని ఆయనతో చెప్పుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఆరు నెలలు ఓపికగా ఉండండి మనకు మంచి రోజులు వస్తాయని, ఎవరు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఆరోగ్యం కుదుటపడిన తర్వాత మన సమస్యలన్నీ సర్దుకుపోతాయని నాయకులు, కార్యకర్తలకు ధీమాని అందించారు. ఏ పార్టీల ప్రలోభాలకు లోను కాకుండా పార్టీలోనే ఉండి అధికార పార్టీని నిలదీయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను నిలబెట్టుకుంటే వారంతా గొప్పవారే లేరన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతో సాధ్యం కాదని పేర్కొన్నారు. నిజామాబాద్ రూరల్‌లో అన్ని అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, కొత్తగా కాంగ్రెస్ పార్టీ చేసేదేముందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఖిల్లా డిచ్‌పల్లి ఉపసర్పంచ్ ఆసది రవీందర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చింత శ్రీనివాస్ రెడ్డి, దాసరి లక్ష్మి నర్సయ్య లక్కిడి యాదగిరి, బొత్త భూమయ్య, జల్లా కాంతారావు, బూస బక్కన్న, మారుపాక సాయిలు, ఆప్షన్ నెంబర్ నయీమ్మ్ దుబ్బుల రాజేష్, నీరడి రాజేందర్, మిట్టపల్లి తేలు గణేష్, మధ్య నరసయ్య, మొగిలి, బి బి ఆర్‌ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా మృతి



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మనీషా మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. ఈ నెల 16న మధ్యాహ్నం జక్రాన్‌పల్లి గ్రామం జాతీయ రహదారి 44 రోడ్ పైన చర్చికి ముందర హెచ్‌ఎఫ్ డీలక్స్ బైక్, టీవీఎస్ ఎక్సెల్‌కు మధ్య జరిగిన రోడ్ ప్రమాదంలో జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన పూజారి మనీషా భర్త ఉదయ కుమార్ అను మహిళ తలకు తీవ్ర గాయమయింది. నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం చనిపోయారని తెలిపారు. దీనిపై ఇది వరకే కేసు నమోదు చేయగా మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం తరలించి అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

లైఫ్ స్కిల్స్‌పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ శివారులో గల క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజ్‌లో మూడు రోజుల వర్క్‌షాప్ రూబికాన్ స్కిల్ డెవలప్మెంట్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, ఎంబీఏ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు లైఫ్ స్కిల్స్‌పైన మూడు రోజుల వర్క్‌షాప్‌ని ముగ్గురు నిష్ణాతులైన ట్రైనర్స్ గోవింద్, సాత్విక్ శ్రీధర్ ద్వారా నిర్వహిస్తున్నారు. ప్రారంభోత్సవ రోజున సోమవారం క్షత్రియ విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ అయిన శ్రీ అల్జాపూర్ దేవేందర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్కే పాండే, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.. ట్రైనర్స్ ద్వారా వాళ్ళ అందించే ప్రతి స్కిల్స్‌ని, విషయాలను చక్కటి అవగాహనతో ఆకలింపు చేసుకొని మీ అభివృద్ధికి వినియోగించుకోవాలని తద్వారా జీవితంలో చక్కటి ఉన్నతి సాధించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ ఆర్కే పాండే మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా ఎన్నో నిర్వహిస్తామని, వీటిని సద్వినించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని కళాశాల టిపిఓ సునీల్ గటడి తదితరులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణలో ఏడుగురు రిమాండ్

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని శెట్పల్లి గ్రామంలో స్థల వివాదంలో కుల సంఘాన్ని బహిష్కరణకు గురిచేసిన విడిసి సభ్యులు ఏడుగుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అనిల్ రెడ్డి సోమవారం తెలిపారు. గ్రామంలోని ఓ స్థలంపై ఒక కులానికి గ్రామస్తులకు ఘర్షణ జరగగా ఈ విషయంపై ఓ కుటుంబాన్ని గ్రామ సంఘం సభ్యులు బహిష్కరణకు గురి చేయడం పట్ల విచారణ చేపట్టామన్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి ఆర్మూర్ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. బడి చిన్న లింబన్న, దాసరి మహేష్, బబ్బూరి నరేష్, బబ్బూరి బక్కన్న, మంచు ప్రభాకర్, గురజాల కన్నా రెడ్డిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. చట్టానికి వ్యతిరేకంగా కుటుంబంపై వీడీసీ సభ్యులు చేపడుతున్న కార్యకలాపాలు పై చర్యలు తీసుకుంటామని, చట్టానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తే వారిని ఉపేక్షించలేదని నిజాంబాద్ అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్ జయరాం తెలిపినట్లు పేర్కొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బాల్యవివాహాలు, లింగ వివక్షత, లైంగిక వేధింపులు, బాలుల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు, బాలుర పట్ల వివక్షత ఉండొద్దని, గృహ హింస, లైంగిక హింస ఉన్నట్లయితే వెంటనే 1098కు ఫోన్ చేసి చెప్పాలనియ అన్నారు. అలా చెప్పినట్లయితే వారి పేర్లు బయటకు రాకుండా మేము తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ కమిటీ ఇన్‌చార్జీ చైతన్య, జెడ్పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్త వెంకటరెడ్డి, అంగన్వాడి సూపర్‌వైజర్ సంధ్య, అంగన్‌వాడీ టీచర్లు వనజా, అసిఫ, శారదా, ఆశా కార్యకర్త బండ ప్రమీల, లక్ష్మీ, అధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

శీతకాల విడిది సందర్భంగా సోమవారం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును బేగంపేట విమానాశ్రయంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

నిజామాబాద్ సిటీ: బేగంపేట ఎయిర్ పోర్ట్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అర్బన్ శాసనసభ్యులు దన్ పాల్ సూర్యనారాయణ స్వాగతం పలికారు. ఆయనతోపాటు బీజేపీ శాసనసభ్యులు ఉన్నారు.



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

కళ తప్పిన రైతు వేదికలు

- శ్రద్ధ చూపని రైతు సమన్వయ సమితి అధ్యక్షులు
- అడవికి దగ్గరలో నిర్మాణంతో నిర్మానుష్యం



నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు రాష్ట్రంలో మరింత అభివృద్ధి చెంది దేశానికీ తెలంగాణ రైతులు దిక్సూచిగా ఉండాలని మంచి సంకల్పంతో నిర్మాణం చేపట్టింది. ఈ రైతు వేదికల నిర్మాణంకు రూ.10లక్షల చొప్పున నిధులు మంజూరు చేసి నిర్మిస్తే నేడు వాటి పరిస్థితి నిర్మానుషంగా మారిందని రైతుల ఆవేదన చెందుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనలు రైతులు రైతు వేదికలలో పంటలు వేసుకొనే ముందు, పంట ధాన్యం అమ్ముకొనే సందర్భలాలలో రైతులు రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ఒకచోట చేరి పంట మార్పిడి కాని, ధాన్యం కొనుగోలు ధరలకు సంబందించిన సందేహాలు, సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసుకొని వారికి ఉన్న సందేహాలను, పంటలకు వచ్చే తెగుళ్ల, నివారణకు సూత్రాలు ఇలాంటివి మండల వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతు సంక్షేమ, అభివృద్ధి కొరకు రైతు వేదికలను వినియోగించారు. ఇప్పటికి కూడా సమావేశాలు జరిపిన ఆనవాళ్లు లేవు. ఇందుకు కారణం మండల గ్రామస్థాయి రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అని తోటి రైతుల నుంచి ఆరోప ణలు వస్తున్నాయి. మండలంలో కొన్ని చోట్ల అటవీ ప్రాంతాలకు, ఊరు అరుబయట నిర్మాణాలు చేపట్టడంతో కనీసం వేదికలను పరిశుభ్రంగా ఉంచుకొనేలా ప్రాం గణ దుస్థితి దుర్భరంగా మారు తుంది. దీనితో కుక్కలను, జంతువు లకు నివాసంగా మారినట్లు ప్రజ లు తెలుపుతున్నారు. పలు చోట్ల ప్రహరీ కూడా లేకపోవటం ఒక కారణం అయితే రైతు సమన్వయ సమితి అధ్యక్షులు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయిలో ఉన్నప్పటికీ వారు వేదికల వైపు కన్నెత్తి కూడా చూడక పోవడం గమనార్హం. దీనితో రైతు వేదికలను పట్టించుకునే నాథుడే లేరని, రాబోయే రోజులల్లో కనీసం వీటిని రైతుల కొరకు వాడుకునేలా చూడాలని మేధావులు ప్రజలు కోరుతున్నారు.

టీయూలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- ఎన్ఎస్‌యూఐ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో నేలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎన్ఎస్‌యుఐ నాయకులు అన్నారు. సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో నూతనంగా బాలికల, బాలుర హాస్టల్, బియిడి కళాశాలకు హాస్టల్, పిహెచ్‌డి విద్యార్థులకు వసతి గృహాలు నిర్మించాలని సూచించారు. యూనివర్సిటీ రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌ను నియమించాలని తెలియజేశారు. యూనివర్సిటీలోని హెల్త్ సెంటర్లో డాక్టర్, నర్సెస్, ల్యాబ్ సిబ్బంది అందరూ 24/7 అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీలో క్రీడల అభివృద్ధి కోసం స్టేడియం, అదేవిధంగా కలల నైపుణ్య సాధన కోసం ఆడిటోరియం నిర్మాణానికి కృషి చేయాలని ఎన్ఎస్‌యుఐ యూనివర్సిటీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు కొమిర శ్రీశైలం, ఉపాధ్యక్షులు అభినయ్, మహేష్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు ఆశిష్, విద్యార్థులు అనిల్ నంద, పవన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కండేరాయుడి జాతర

నవతెలంగాణ-ఆర్మూర్

నూతన ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం కండేరాయుడి జాతర ఘనంగా నిర్వహించారు. మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సురేంద్ర(45) రోడ్డు దాటుతుండగా ఇంకో వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు అతివేగంగా వచ్చి ఢీ కొనడంతో తీవ్రగాయాలపాలు కావడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సురేంద్ర మిని కంటైనర్‌లోడ్ తీసుకుని హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బీబీపూర్ తండా, కాన్పూర్ దాబా వద్ద ఆపి, రోడ్డు దాటుతుండగా, హైదరాబాద్ వైపు నుంచి ఒక వ్యక్తి మోటర్ సైకిల్‌పై అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి సురేంద్రకు ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇందల్‌వాయి టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం శ్రీకృష్ణ ఆసుపత్రి నిజామాబాద్‌లో చేర్పించారు. సురేంద్ర చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. మృతుని కుమారుడు మురాయం సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యల పట్ల నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్

మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అనుచరులమని చెప్పుకునే కొందరు ప్రస్తుత ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఖండిస్తూ సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు శివకుమార్, దళిత మోర్చా రాష్ట్ర నాయకులు నల్ల రాజారాం అందాపూర్ రాజేష్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా బీజేపీ మంచిది, అవినీతి అక్రమాలను వెలికి తీస్తే బిజెపి మంచిది కాదు అని చెప్తున్నారని అన్నారు. ఎంపీపీ ప్రభాకరా బిజెపి కండువా వేసుకున్న రాజ్యాంగబద్ధంగా ఎన్నిక ప్రక్రియ ఎలా జరిగాలో అలా జరిగితే ఉంటే ఎంపీపీగా ఉంటావు.. లేదంటే లేదని, అంతేగాని అనవసరంగా బిజెపి పై అక్కసుకక్కడం సరి అయింది కాదని తెలిపారు. ప్రభాకర్ నువ్వు ఎంపీపీ కాకముందు ఆటో నడిపే వాడివి మరి ఎంపీపీ కాగానే దళిత బందును నువ్వు వ్యక్తిగతంగా తీసుకో లేదా అని.. దళిత బంధు పేరిట కమిషన్లు వసూలు చెయ్యలేదా.. అని అన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

12 నుండి 15 ఎకరాల పేదలకు ఇవ్వాల్సిన అసైన్డ్ భూమిని అక్రమంగా కబ్జా చెయ్యలేదా అని ప్రశ్నించారు. దళిత బంధు పేరుమీద వచ్చిన రెండు హార్వెస్టర్లను, రెండు ట్రాక్టర్లను సైతం తీసుకోలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు దళిత నాయకులు అని చెప్పే కొందరు ఆదివారం అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నాకు దిగడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. అవినీతి అక్రమాలను కూకటి వేళ్లతో బయటకు లాగి ఎంతటివారినైనా బయట పెట్టడం కచ్చితంగా జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సాయికుమార్ దళిత, బిజెపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.